సాక్షి
రంగారెడ్డి
ఆదివారం । 5 । మార్చి । 2023




31 పోలింగ్ స్టేషన్లు
ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో 31 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. 8లో▸

టీఎస్‌సెట్ పరీక్ష వాయిదా
ఉస్మానియా యూనివర్సిటీ: ఈ నెల 13న జరిగే టీఎస్‌సెట్- 2022 పరీక్షను ఎమ్మెల్సీ ఎన్నికల దృష్ట్యా వాయిదా వేసినట్లు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వర్సిటీ అధికారులు పేర్కొన్నారు. తిరిగి ఈ పరీక్షను నిర్వహించే తేదీని త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. అలాగే.. ఈ నెల 14, 15వ తేదీలలో జరిగే టీఎస్ సెట్ పరీక్షలు యథావిధిగా జరగనున్నాయని అధికారులు స్పష్టం చేశారు.

లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం
కొడంగల్ రూరల్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారాం సూచించారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలలోపు అన్ని ధ్రువీకరణ పత్రాలతో అప్లికేషన్ అందజేయాలని తెలిపారు. నీట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు.

‘పరీక్షా’ కాలం!

సమీపిస్తున్న వార్షిక పరీక్షల గడువు
- ఈనెల 15 నుంచి ఇంటర్, ఏప్రిల్ 3 నుంచి టెన్త్ ఎగ్జామ్స్
- తీవ్ర ఒత్తిడికి గురవుతున్న విద్యార్థులు
- ఆందోళనలో తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు
- మానసిక, శారీరక ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలంటున్న నిపుణులు



వార్షిక పరీక్షలు ఇలా ..

టెన్త్	:	ఏప్రిల్ 3 నుంచి 13 వరకు
సమయం	:	ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటలు
హాజరయ్యే విద్యార్థులు	:	49,574
ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాలు	:	226
ఇంటర్మీడియెట్ ఫస్టియర్	:	ఈనెల 15 నుంచి ఏప్రిల్ 3 వరకు
సమయం	:	ఉదయం 9 నుంచి 12 గంటల వరకు
హాజరయ్యే విద్యార్థులు	:	71,000
ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాలు	:	182
ఇంటర్మీడియెట్ సెకండియర్	:	ఈనెల 16 నుంచి ఏప్రిల్ 4 వరకు
సమయం	:	ఉదయం 9 నుంచి 12 గంటల వరకు
హాజరయ్యే విద్యార్థులు	:	56,000
ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాలు	:	182

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ‘పరీక్షా’ కాలం వచ్చేసింది. విద్యార్థులకే కాదు.. వారికి చదువు చెప్పిన ఉపాధ్యాయులకు కూడా ఒత్తిడి ఎదురుకానుంది. ఎలాగైనా తమ పిల్లలు అందరికంటే మెరుగైన ఫలితాలు సాధించాలని ఇటు విద్యాసంస్థల యాజమాన్యాలు, అటు అధ్యాపకులు మాత్రమే కాదు తల్లిదండ్రులు కూడా ఆశిస్తుంటారు. చదువు విషయంలో ఇంట్లో తల్లిదండ్రుల నుంచి కాలేజీలో అధ్యాపకుల నుంచి ఒత్తిడి పెరుగుతుండటంతో విద్యార్థులు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి లోనవుతుంటారు. ఒత్తిడి నుంచి ఉపశమనం కల్పించే నిపుణులు కాలేజీల్లో లేకపోవడం విద్యార్థుల పాలిటశాపంగా మారింది.

ఒకవైపు ఆందోళన..మరోవైపు అనారోగ్యం

ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతోంది. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్లలో తాగునీరు నిల్వ చేసే ట్యాంకులను రోజుల తరబడి శుభ్రం చేయడం లేదు. వీటిలో ఈకొలి, సాల్మొనెల్లా, షిజెల్లా, లెజియోనెల్లా తదితర బ్యాక్టీరియా చేరుతుంది. మెజార్టీ పాఠశాలలు, కాలేజీల్లో విద్యార్థులు ట్యాంకుల్లో నిల్వ చేసిన నీరు తాగుతుంటారు. ఉదయం వండిన ఆహారం మధ్యాహ్నం వరకే పాడైపోతుంది. దీన్ని తీసుకున్న వారు తర్వాత వాంతులు, విరేచనాలు, టైఫాయిడ్ జ్వరాల బారినపడుతుంటారు. ఎండలో ఆడటం ద్వారా వడదెబ్బకు గురవుతుంటారు. కీలకమైన పరీక్షల సమయంలో పిల్లలు అస్వస్థతకు గురవుతుండడం.. అనారోగ్యం కారణంగా చదవలేకపో వడం.. చదివిన అంశాలు గుర్తుండకపోవడం.. పరీక్షలో ఫెయిలైతే.. తల్లిదండ్రులతో పాటు బంధువులు, ఇరుగు పొరుగువారు చులకనగా చూస్తారనే భయంతో ఒత్తిళ్లకు లోనవుతుంటారు.

పరోక్షంగా తల్లిదండ్రులూ కారణమే..

రెసిడెన్షియల్ హాస్టళ్లలో ఉన్న పిల్లల పరిస్థితి ఒకలా ఉంటే..ఇంటి నుంచి స్కూలు, కాలేజీకి వెళ్తున్న డే స్కాలర్ విద్యార్థుల పరిస్థితి మరోలా ఉంది. చాలా మంది తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యాన్ని పట్టించుకోవడం లేదు. ఉద్యోగం, వ్యాపారం ఇతర పనుల్లో తండ్రి బిజీగా ఉంటే.. ఇంట్లో ఉన్న తల్లులు టీవీలు, సెల్‌ఫోన్లకు అతుక్కు పోయి కూర్చొంటున్నారు. మరికొంతమందైతే ఏకంగా ఇంట్లో పిల్లల సమక్షంలోనే తరచూ ఘర్షణ పడుతున్నారు. కనీసం పిల్లలు వేళకు నిద్రపోతున్నారా? లేస్తున్నారా? ఏం తింటున్నారు? ఏం చూస్తున్నారు? ఏం ఆలోచిస్తున్నారో కూడా పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రుల ప్రవర్తన కూడా పరోక్షంగా విద్యార్థుల ఏకాగ్రతను దెబ్బతీస్తోంది. మంచి మార్కులు సాధించి, ఏ ఇంజనీరో..? డాక్టరో.. అవుతాడనుకున్న కొడుకు, కూతురు కళ్ల ముందే విఫలజీవిగా మారి కన్పిస్తుండటంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

తేలిగ్గా జీర్ణమయ్యే ఆహారం ఇవ్వాలి



పరీక్షల సమయంలో తేలిగ్గా జీర్ణమయ్యే ఆహార పదార్థాలను వండిపెట్టాలి. మసాలా వేపుళ్లు, ఆయిల్ పుడ్డుకు బదులు.. అప్పుడే వండివార్చిన పప్పు, సాంబారు, ఆకు కూరలు, కాయగూరలు, మజ్జిగ వంటివి ఎక్కువగా అందించాలి. ఉదయం, సాయంత్రం గుడ్డుతోపాటు పండ్ల రసాలు, సలాడ్స్ ఇవ్వాలి. వేళకు నిద్రపోయేలా చూడాలి.

– డాక్టర్ సుజాతస్టీఫెన్, డైటీషియన్

వేళకు నిద్రపోవాలి



పరీక్షల సమయంలో ఎక్కువ సేపు చదవాలనే ఉద్దేశంతో చాలా మంది రాత్రి పొద్దుపోయిన తర్వాత కూడా మేల్కొనే ఉంటారు. ఇలా గంటల తరబడి మేల్కొని ఉండటం ద్వారా చదివిన అంశాలు గుర్తుండవు. వేళకు నిద్రపోయి..వేళకు మేల్కొనడంతో మానసిక ప్రశాంతత లభిస్తుంది. చదివిన అంశాలు మెదడులో నిక్షిప్తమవుతాయి. ఎంత సేపు చదివామనేది కాకుండా ఎంత ఇష్టంగా చదివామనేది కీలకం. పిల్లల మానసిక స్థితిని అంచనా వేయకుండా చదువు విషయంలో వారిపై ఒత్తిడి తేవడం సరికాదు. సాధ్యమైనంత వరకు పిల్లలను మోటివేట్ చేయాలి. సమాజంపై వారికి అవగాహన కల్పించినపుడే మంచి ఫలితాలు వస్తాయి.

– డాక్టర్ కళ్యాణ చక్రవర్తి, మానసిక నిపుణుడు

న్యూస్‌రీల్

కొనసాగుతున్న విద్యుత్ ఉద్యోగుల ధర్నా



ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

హుడాకాంప్లెక్స్: విద్యుత్ వేతన సవరణలో జాప్యాన్ని నిరసిస్తూ.. విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ ప్రకటించిన నేపథ్యంలో 8వ రోజు భోజన విరామ సమయంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యాలయం ఆటోనగర్‌లో ధర్నా నిర్వహించారు. ఇందులో పెద్ద ఎత్తున సరూర్‌నగర్ సర్కిల్ ఉద్యోగులు, వివిధ అసోసియేషన్, యూనియన్ల ప్రతినిధులు రాంమోహన్, రామకృష్ణ, సంగమేశ్వర్, సైదులు,యుగంధర్, వేదప్రకాశ్, సత్యనారాయణ, కుమారచారి పాల్గొన్నారు.

సయోధ్యతోనే మంచి భవిష్యత్తు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి నాగరాజు

యాచారం: సయోధ్యతోనే ఇరు వర్గాలకు మంచి భవిష్యత్తు ఉంటుందని,సమయాన్ని, డబ్బును వృథా చేసుకోవద్దని ఇబ్రహీంపట్నం అదనపు సీనియర్ సివిల్ జడ్జి నాగరాజు అన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో శనివారం న్యాయ విజ్ఞన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయ సలహాలు,సూచనలు పొందేందుకు ప్రజలు న్యాయ విజ్ఞాన సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూముల పంపకం, ఘర్షణలు, దాడులు, ప్రతి దాడులతో ఇరు వర్గాలు పోలీస్ స్టేషన్లకు వెళ్లి కేసులు నమోదు చేసుకుని అన్ని విధాలా నష్ట పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సరైన సమయంలో న్యాయ సలహాలు పొంది ముందుకెళ్తే ప్రయోజనం ఉంటుందన్నారు. న్యాయ సలహాలపై అన్ని గ్రామాల ప్రజల్లో చైతన్యం కల్పించడం కోసమే న్యాయ విజ్ఞాన సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు స్పష్టం చేశారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు శివలీల, న్యాయవాదులు అంజన్‌రెడ్డి, వెంకటేష్, మురళి, మహేందర్, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

శోభాయాత్రను విజయవంతం చేయండి



నూతన కమిటీ సభ్యులకు సన్మానం

షాద్‌నగర్: అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని నిర్వహించే జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభాయాత్రను విజయవంతం చేయాలని శోభాయాత్ర కమిటీ జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ సింగిరెడ్డి పరమేశ్వర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ అతిథి గృహంలో శనివారం కమిటీ జిల్లా కోకన్వీనర్ మహేశ్ మాల అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సింగిరెడ్డి పరమేశ్వర్ మాట్లాడుతూ.. బహుజన మహనీయుల ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలనే ఉద్దేశంతో శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని గ్రామగ్రామాన బహుజన మహనీయుల శోభాయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. అనంతరం డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు పాతూరి రమేష్, వెంకటస్వామి, చెక్కలదినేష్, బాలకృష్ణ, బాల్‌రాజ్, సత్య నారాయణ, చంద్రశేఖర్, సుంకం నర్సింహ, అంజి, రాజు, వినోద్, శివ, జగదీశ్, శ్రీకాంత్, మల్లేశ్, పెద్దింటి.శ్రీనాథ్, రవీంద్రనాథ్, కుమార్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

10 జీపీఏతో గుర్తింపు
బొంరాస్‌పేట: పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని గిరిజన సంక్షేమశాఖ కమిషనరేట్ జేడీ సత్యనాయరాయణ అన్నారు. మండల పరిధిలోని బొట్లోనితండా గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లు, వంటలు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. 10 జీపీఏ సాధించే విద్యార్థులకు గిరిజన సంక్షేమ శాఖ నుంచి రూ.50 వేల ఆర్థిక సాయంత అందుతుందని తెలిపారు.

శభాష్ స్టూడెంట్స్



విద్యార్థులను అభినందిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

మహేశ్వరం: అమెరికాలోని టెక్సాస్ నగరంలో మే 25 నుంచి 28 వరకు నిర్వహించే ఇంటర్నేషనల్ స్పేస్ డెవలప్‌మెంట్ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడానికి మహేశ్వరం మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆహ్వానం అందింది. ఈమేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అమెరికాలో జరిగే సదస్సుకు ప్రభుత్వ మోడల్ స్కూల్ విద్యార్థులకు ఆహ్వానం రావడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు ప్రతి విషయాన్ని శాస్త్రీయ దృష్టితో ఆలోచిస్తూ ముందుకు సాగాలని, తోటి విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మహేశ్వరం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ బాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రోచర్ ఆవిష్కరణ
ఫిలింనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం కొత్తగా ప్రవేశపెట్టిన పీజీ డిప్లొమా కోర్సుల బ్రోచర్‌ను శనివారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె. సీతారామారావు ఆవిష్కరించారు. కామర్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రవేశ పెట్టిన కోర్సుల్లో పీజీ డిప్లొమా ఇన్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమా ఇన్ మార్కెటింగ్ మేనేజ్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఆపరేషన్స్ మేనేజ్‌మెంట్ కోర్సులు ఉన్నాయని డీన్ ఆనంద్ పవార్ పేర్కొన్నారు. ఆయా కోర్సులకు దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ మార్చి 10 అని వెల్లడించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి పాల్గొన్నారు.

పుష్కరిణిలో మునిగి మృతి



జంగయ్య (ఫైల్)

చేవెళ్ల: పుష్కరిణిలో స్నానం చేస్తుండగా మూర్ఛ వ్యాధి రావటంతో నీట మునిగి మృతి చెందిన సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. మండలంలోని తల్లారం అనుబంధ గ్రామమైన దుద్దాగు గ్రామానికి చెందిన కొనపురం జంగయ్య(40) వ్యవసాయం, కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మండలకేంద్రంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి నుంచి కొనసాగుతున్న ఉత్సవాల్లో భాగంగా పుష్కరిణి వద్ద టెంకాయలు అమ్మే దుకాణం పెట్టుకొని పది రోజులుగా అక్కడే ఉంటున్నాడు. శనివారం ఉదయం భార్యతో కలిసి పుష్కరిణి వద్ద స్నానం చేస్తుండగా మూర్ఛ రావటంతో నీటిలో మునిగిపోయాడు. భార్య కేకలు వేయటంతో స్థానికులు వచ్చి అతన్ని బయటకు తీశారు. అప్పటికే మృతి చెందాడు. మృతదేహాన్ని చేవెళ్ల ఆస్పత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి



మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ ఈఈ ఫణికుమారి

కడ్తాల్: పదోతరగతి వార్షిక పరీక్షల్లో గిరిజన సంక్షేమ శాఖ వసతి గృహ విద్యార్థులతో పాటు, గిరిజన ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి (డీటీడీవో) కేతు రామేశ్వరిదేవి, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయ ఈఈ ఫణికుమారి ఆకాంక్షించారు. మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం స్వపరిపాలన దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ.. పదోతరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించేలా, ప్రణాళిక ప్రకారం ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో మార్పులను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులు బాగా చదవాలన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులకు ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా అల్పాహారం అందించడం జరుగుతుందన్నారు. పదోతరగతి విద్యార్థుల కోసం రూపొందించిన 60 రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయాలని, ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతుల నిర్వహణపై శ్రద్ధ చూపించాలని, ఏ ఒక్క విద్యార్థి కూడా పరీక్షల్లో వెనుకబడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయులతో పాటు, విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి రాములు ఉన్నారు.

ప్రజల్లో చైతన్యం తేవడానికే స్వరాజ్య పాదయాత్ర
డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్



మాట్లాడుతున్న విశారదన్ మహరాజ్

మంచాల: బలహీన వర్గాల ప్రజలు రాజకీయ విజ్ఞానం నేర్చుకోవాలని డీఎస్పీ (దళిత శక్తి ప్రోగ్రాం) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. మండలంలోని జాపాల, మంచాల గ్రామాల్లో శనివారం స్వరాజ్య పాద యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు రాజకీయ అవగాహన లోపంతో తీరని నష్టాలకు గురవుతున్నారని తెలిపారు. అగ్రవర్ణాలు చేసే రాజకీయ కుట్రలో పావులుగా మారి తమ వర్గాలకు తామే తీరని అన్యాయం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వరాజ్య పాదయాత్ర అగ్రవర్ణాలకు చెందిన నాయకులను దూషించడానికి కాదని నూటికి 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజల్లో చైతన్యం తేవడానికే అన్నారు. రాజ్యాధికారం వస్తే తప్ప సరైన న్యాయం దక్కదని, అందుకోసం కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాదయాత్ర ఇన్‌చార్జి లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు రాకేష్ మహరాజ్, మండల అధ్యక్షుడు ఆనంద్, మండల నాయకులు శ్రావణ్, వినోద్, ప్రదీప్, రవి, సుధాకర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి.. వలకు చిక్కి



రాము(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: చేపల వేటకు వెళ్లి వలకు చిక్కుకొని నీట మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ పరిధిలోని కావలికుంట తండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. దూసకల్ పంచాయతీ పరిధిలోని కావలికుంట తండాకు చెందిన రాము(32), సురేష్ శుక్రవారం అర్ధరాత్రి దూసకల్ సమీపంలోని పెరుమాళ్ చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లారు. రాము సురేష్‌కు వరుసకు బాబాయి. రాము వలను సరి చేసేందుకు చెరువులోకి దిగగా సురేష్‌కు ఈత రాకపోవడంతో చెరువు గట్టుపైనే కూర్చున్నాడు. వలను సరి చేస్తుండగా రాము కాలుకు వల చిక్కుకొని నీటిలో మునిగిపోయాడు. విషయాన్ని గమనించిన సురేష్ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపాడు. చీకటి కావడంతో మృతుడిని వెతికేందుకు వీలు కాలేదు. శనివారం ఉదయం విషయం తెలుసుకున్న పట్టణ సీఐ నవీన్‌కుమార్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. మృతుడి ఆచూకీ లభించకపోవడంతో సీఐ నవీన్ కుమార్ ఫైర్ సిబ్బంది సహాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. చెరువు లోతు ఎక్కువగా ఉండటం, నీళ్లు ఉండటంతో సాయంత్రం వరకు మృతదేహం దొరకలేదు. సాయంత్రం తరువాత మృతదేహం నీటిపై తేలుతూ కనిపించడంతో ఫైర్ సిబ్బంది మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య జ్యోతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా గుర్రపు స్వారీ పోటీలు

- విజేతలకు బహుమతులు అందించిన డీజీపీ అంజనీకుమార్

మొయినాబాద్‌రూరల్: హైదరాబాద్ హార్స్ రైడ్ పోలో క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అజీజ్‌నగర్ సమీపంలో నిర్వహించిన గుర్రపు స్వారీ పోటీలు ఆద్యంతం ఉత్సాహంగా సాగాయి. విజేతలకు డీజీపీ అంజనీకుమార్, నేషనల్ ఫిష్ డిపార్ట్‌మెంట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ స్వర్ణ బహుమతులు అందించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. సంవత్సరానికి ఒకసారి కాకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఇలాంటి ప్రదర్శనలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు.



గుర్రపు స్వారీలో గెలుపొందిన వారికి షీల్డ్ బహూకరిస్తున్న డీజీపీ అంజనీకుమార్

కార్యక్రమంలో క్లబ్ సభ్యులురాజు శివరాజ్, రవీంద్రనాథ్, సునీల్, సాయికుమార్, రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాంరెడ్డి పాల్గొన్నారు.



స్టీల్ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఉన్నతాధికారులు



స్టీల్ బ్రిడ్జి.. నగరానికే తలమానికం

- పనులను పరిశీలించిన మంత్రి కేటీఆర్
- నత్తనడకన సాగడంపై అసంతృప్తి
- జూన్ 2లోగా పూర్తి చేయాలని ఆదేశం

ముషీరాబాద్: ఇందిరా పార్కు నుంచి వీఎస్‌టీ వరకు 2.6 కిలోమీటర్ల మేర రూ.440 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఎలివేటెడ్ స్టీల్ బ్రిడ్జి నగరానికే తలమానికం కానుందని ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ అన్నారు. శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులతో కలిసి స్టీల్ బ్రిడ్జి పనులను ఆయన పరిశీలించారు. పనులు నత్త నడకన సాగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2వ తేదీలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే రాత్రింబవళ్లు పని చేయాలని కేటీఆర్ సూచించారు. ఇందిరాపార్కు చౌరస్తా నుంచి కొద్ది దూరం నడుచుకుంటూ వచ్చి పనులను పరిశీలించారు. అనంతరం వీఎస్‌టీ వద్ద నిర్మితమవుతున్న ర్యాంప్ పైకి ఎక్కి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించి నిర్మాణ పనులను వేగవంతం చేస్తామన్నారు. ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద ట్రాఫిక్‌ను తగ్గించి ముషీరాబాద్, ఖైరతాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల ప్రజల సౌకర్యార్థం స్టీల్ బ్రిడ్జిని చేపడుతున్నామని తెలిపారు. నగర పౌరులకు ట్రాఫిక్ రద్దీ సమస్యకు ఉపశమనం లభిస్తుందనే ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

రిటైనింగ్ వాల్ పనుల పరిశీలన..

స్టీల్ బ్రిడ్జి నిర్మాణంతో పాటు ఎస్ఎన్‌డీపీలో భాగంగా చేపట్టిన హుస్సేన్‌సాగర్ నాలా రిటైనింగ్ వాల్ పనులను మంత్రి కేటీఆర్ సమీక్షించారు. హుస్సేన్‌సాగర్ వరద నీటి ద్వారా లోతట్టు ప్రాంత ప్రజలకు భవిష్యత్తులో ముంపు ఇబ్బందులు రాకుండా ఉండేందుకు రిటైనింగ్ వాల్ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం చిక్కడపల్లిలోని కూరగాయాల మార్కెట్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు.

చేపల మార్కెట్ కోసం డిజైన్ రూపొందించండి..

దేశంలోనే ఫ్రెష్ ఫిష్ మార్కెట్ ఎక్కడ ఉందంటే రాంనగర్‌లోనే ఉందనే విధంగా చేపల మార్కెట్‌ను మంచి డిజైన్ చేసి వారం రోజుల్లో తీసుకురావాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తనయుడు ముఠా జైసింహకు మంత్రి కేటీఆర్ బాధ్యతలను అప్పగించారు. జాగా నేను ఇప్పిస్తా.. డబ్బులు ఇప్పిస్తా వారం రోజుల్లో డిజైన్ చేసి తీసుకురా అని జైసింహతో చెప్పారు. ఈఎన్‌సిలు శ్రీధర్, జియావుద్దీన్, సీఈ దేవానంద్, ఎస్ఈ అనిల్‌రాజ్, ఈఈ శ్రీనివాస్,గోపాల్, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు మంత్రి వెంట ఉన్నారు.

బాలుడి మృతితో ఉద్రిక్తత

- కేశవరెడ్డి స్కూల్‌కు చెందిన మూడో తరగతి చిన్నారి కన్నుమూత
- హాస్టల్‌లోని మంచంపై నుంచి పడ్డాడని చెబుతున్న యాజమాన్యం
- టీచర్లే కొట్టారని తల్లిదండ్రుల ఆరోపణ
- సమగ్ర విచారణకు విద్యాశాఖ మంత్రి సబిత ఆదేశం



విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడుతున్న సీఐ

పూడూరు: మండల పరిధిలోని కేశవరెడ్డి పాఠశాలకు చెందిన మూడో తరగతి చదువుతున్న బాలుడు కె.కార్తీక్ (8) అనుమానాస్పద మృతి ఉద్రిక్తతకు దారితీసింది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిన్నమంగళారానికి చెందిన కె. ప్రవీణ్ కుమారుడు కార్తీక్ గత నెల 27న హాస్టల్ మంచంపై నుంచి కింద పడిపోయాడంటూ స్కూలు యాజమాన్యం సమాచారం ఇచ్చింది. దీంతో కుటుంబ సభ్యులు మరుసటి రోజు వచ్చి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. టీచర్లు కొట్టడంతోనే చనిపోయాడని, తమ కుమారుడి మృతికి పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని కార్తీక్ తల్లిదండ్రులు ఆరోపించారు. చన్గోముల్ ఎస్‌ఐ విఠల్‌రెడ్డి ఈ ఘటనపై విచారణ జరిపారు. అయితే స్కూలు ప్రధాన గేటుకు తాళం వేసి విచారణ చేయడం ఏమిటంటూ విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళనకు దిగారు. పాఠశాల లోపలికి చొచ్చుకునిపోయేందుకు యత్నించారు. దీంతో ఉద్రిక్తత నెలకొంది. పరిగి డీఎస్పీ కరుణసాగర్‌రెడ్డి, సీఐ వెంకటరామయ్య పాఠశాలకు చేరుకుని బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. డీఈఓ రేణుకాదేవి పాఠశాలను సందర్శించారు. విచారణలో స్కూలు బాధ్యులది తప్పని తేలితే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్తీక్ మృతిపై సమగ్ర విచారణ జరపాలని పాఠశాల విద్యా డైరెక్టర్ శ్రీదేవసేనను మంత్రి సబితారెడ్డి ఆదేశించారు.

తల్లి మందలించిందని..

యువకుడి బలవన్మరణం



శివనారాయణ(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన చటాన్‌పల్లి శివారులో శుక్రవారం చోటు చేసుకుంది. మహబూబ్‌నగర్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ కృష్ణ ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చాకిచర్లకు చెందిన కట్ట శివనారాయణ(22) హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల డబ్బు వృథాగా ఖర్చు చేస్తున్నావని తల్లి మందలించడంతో మనస్తాపం చెందిన యువకుడు శుక్రవారం రాత్రి షాద్‌నగర్‌లోని స్నేహితుడు పవన్(మేస్త్రీ)కి ఫోన్ చేశాడు. నన్ను అమ్మ తిట్టింది.. నేను చనిపోతున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ సమీపంలోని చటాన్‌పల్లి శివారులో రైలు పట్టాలపై గుర్తు తెలియని మృతదేహం ఉన్నట్లు స్టేషన్ మాస్టర్ అభిదేష్‌యాదవ్ రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలానికి చేరుకొన్న రైల్వే పోలీసులు మృతుడు శివనారాయణగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం శవాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. స్టేషన్ మాస్టర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 31 పోలింగ్ స్టేషన్లు

ప్రిసైడింగ్ అధికారుల సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం జిల్లాలో 31 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ ప్రతీక్‌జైన్ తెలిపారు. ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ శాసనమండలి ఉపాధ్యాయ నియోజకవర్గం ఎన్నికల ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో మొత్తం 9,186 మంది ఉపాధ్యాయ ఓటర్లు ఉండగా, వీరిలో 4,870 మంది పురుషులు, 4,315 మంది మహిళా ఓటర్లు సహా ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నట్లు తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు నియమించిన ప్రిసైడింగ్ అధికారులు ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకూడదని, ఏదైనా అనుమానం ఉంటే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఎన్నికలను ప్రశాంతమైన వాతావరణంలో, సజావుగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ తిరుపతిరావు, రెవెన్యూ అధికారి హరిప్రియ, జెడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, డిప్యూటీ సీఈఓ రంగారావు, కో ఆపరేటివ్ అధికారి ధాత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.